3. కొంచెముగ విత్తెడివారు – కొంచెము సమకూర్చెదరు = హెచ్చువిత్తెడి వారికిలను – హెచ్చు ఫలములు నిండుగ దొరుకున్ ॥ఇయ్యుడి॥

4. సంతసంబుతో నిచ్చెడివారి నెంతో దేవుడు కృపతో బ్రోచున్ = వింతగా దీవెనలతోడ – అంతయు దయచేసి బ్రోచున్ ॥ఇయ్యుడి॥

5. యేసు కృపను ఎరిగిమనుడి – యేసు మార్గమునందు నడువుడి= దాసుడై ధనమంత విడిచె – నీచులకొరకిలను మున్నె ॥ఇయ్యుడి॥

6. పరమనిధులను నింపుకొనుడి – పరమ దేవుని ప్రేమను గనుడి = పరమ నిధులలో చిమ్మెటుండదు – దొంగలసలే లేరుసుమండి ॥ఇయ్యుడి॥

– జి.జాన్ తాతయ్య

## 571 దశమ భాగము

రా –హిందుస్థాని తోడి తా – రూపకము

దశము భాగము లెల్ల దేవునివి – ధారాళముగ నియ్య సమకూడుఁడి = పశువులు పైరులు దేవునివి – పసిఁడి లోహపుగనులు దేవునివి భాగ్యభోగ్యము లెల్ల దేవునివి – భావించి కానుకలను నియ్యుఁడి ॥దశమ॥

1. దేవునివి దొంగిలించెదరా – దేవదేవుని మోసపుచ్చెదరా = భావించి మది నెంచి భయము నెంచి – ప్రార్థింపఁ దలవంచి ప్రభు భాగమున్ – దేవాలయంబును పూర్ణంబుగా – దేదీప్యముగా నుండ సమకూర్చుఁడీ ॥దశమ॥

2. పరిశుద్ధ దేవుని మందిరముఁ – పరిపూర్ణముగాను యోచించుఁడీ = పరిశుద్ధ భాగము విడఁదీయుఁడీ – పాడిపంటలు నాస్తి దేవునిని – పదియవ భాగంబు దేవునివి – పరమాత్మ దీవెనలను బొందుఁడీ ॥దశమ॥

3. ప్రథమ ఫలంబులు దేవునివి – విదితంబుగా నీయ మది నెంచుఁడీ = సదమల హృదయములను బొందియుఁ – ప్రథమ భాగము నెల్ల విడఁదీసియు – ముదమున దేవునికర్పించుఁడీ – సదయు దీవెనలొంద సమకూర్చుఁడీ ॥దశమ॥

4. ఆకసపు వాకిండ్ల విప్పుదును – అధిక కృపలను గుమ్మరించుదును = మీ కష్టఫలములను దీవింతును– భీకర నాశంబుఁ దొలఁగింతును – మీ కానంద దేశ మిత్తు నని – శ్రీకరుం డెహోవా సెల విచ్చెను ॥దశమ॥



5. దినభోజనం బిచ్చు దేవునిని– ఘన సౌఖ్యముల నిచ్చు దేవునిని = వినయంబుతో మదిని ధ్యానించుచు – దినభోజనంబులను భాగించుచు = మానక దేవుని కర్పించు డీ – ఘనసేవ జయమొందు పని బూనడీ ॥దశమ॥

– కూచిపూడి రాజరత్నము

## 572 ఔదార్యము

రా –కాంభోజి తా – రూపకము

స్తుతియు మహిమయు నీకె – క్షితికిన్ దివికిన్ నీటి –వితతికిన్ కర్తవై –వెలయు మా దేవా = ప్రతి వస్తువును మాకు బహుమతిగా నిచ్చు– హితుఁడా మా ప్రేమ నీ – కెట్లు చూపుదుము ॥స్తుతియు॥

1. పసిఁడి వర్ణపు టెండ – భాగ్య ధారల వాన – విసరు మంచి గాలి – విరియు పుష్పములు = రస మొల్కు పండ్లు నీ– రమ్య ప్రేమన్ జాటున్ – బ్రసరించు కో తలో – పల నుందు వీవు ॥స్తుతియు॥

2. నెమ్మదిగల యిండ్లు – నిజసౌఖ్య కాలములు – ఇమ్మహి ఫలియించు – నైశ్వర్యాధికముల్ = ఇమ్ముగ గలిగిన – హృదయులమై వంద – నమ్ములు ఋణపడి యు –న్నాము నీకు ॥స్తుతియు॥

3. దురితంబు లొనరించి – దౌర్భాగ్య స్థితి నున్న – ధరణికి నీ పుత్రున్ – ధర్మంబు జేసి = నరుల కీ ధర్మమున – కొరఁత దీర్చెదు సర్వ – వరము లమర్చిన – పరమోపకారి ॥స్తుతియు॥

4. జీవంబు ప్రేమను – జేవఁ గల్గించెదు – పావనాత్మను మాకై – పంపితివి = దీవెన లేదు రె – ట్లావరింపను మమ్ము – నీ విమలాత్మ వా – నిని గుమ్మ రించు ॥స్తుతియు॥

5. నరులకు విమోచ – నము గల్గె పాపంబుల్ – పరిహార మాయెఁ గృ – పాసాధనముల్ = దొరికె మోక్షాంశంబు – స్థిరమాయె మేము నీ – కొరకేమి తేగలము – పరిపూర్ణ జనకా ॥స్తుతియు॥

6. మాకై వాడుకొనెడి – రూకల్ వ్యర్థం బగును – నీకై యప్పుగ నిచ్చు – నిఖిల వస్తువులు = శ్రీకరంబగు నిత్య – శ్రేష్ఠ ధననిధియై పై – లోకంబు నందుండు – లోపంబు లేక ॥స్తుతియు॥